# అమ్మా...!

లంకంత లోగిలి బిక్కు బిక్కుమంటోంది. మనుష్యులు లేక కాదు. ఇంటి నిండా గుంపులు-గుంపులుగా అమ్మ తరపువాళ్ళు-నాన్న తాలూకువాళ్ళు, స్నేహితులు-తెలిసినవాళ్ళు-తెలియని
వాళ్ళు...ఎవరెవరో...దిగులుగా మౌనంగా తిరుగుతున్నారు. ఆ సందడిలో జీవం లేదు. చిన్నపాప ఒక మూల బిక్కముఖంతో నిశ్చేష్టంగా నిలబడి వుంది. హీనంగా, గుండెలవిసేలా వినవస్తున్న రోదనలు పాపకు భయం కలిగిస్తున్నాయి. ఒక మూల నాన్న తల వాల్చి నిర్వికారంగా కూర్చున్నాడు. ఎవరెవరో వచ్చి భుజం తట్టి ఓదారుస్తున్నారు. నాన్నని తనెప్పుడూ అలా చూడలేదు.

పాప జాలి జాలువారుతున్న దిగులు చూపుతో చూస్తోంది. కదలక, మెదలక పడివున్న అమ్మకు స్నానం చేయించారు మంత్రాలు చదువుతూ. ఎర్రటి కొత్త చీర కట్టారు. నంటి నిండా కుప్పలుగా పసుపు, కుంకుమ, పూలు చల్లారు. అంతా అమ్మను ఎత్తుకుని తీసుకుపోతున్నారు. ఏడుపులు హృదయవిదారకంగా మిన్నంటుతున్నాయి. భయంకరంగా మేళం మోగుతోంది. ఎవరో ఘొల్లుమంటూ పాపను దగ్గరకు లాక్కున్నారు. ఆ స్పర్శలో అమ్మను పోల్చుకోవాలని పరితపిస్తోంది పాప హృదయం. అమ్మ పిలుపుకోసం ఆవేగ పడుతోందా పసి మనసు. వెళ్ళిపోయిన అమ్మ తిరిగి రాలేదు. నాన్న ఒక్కడే వచ్చాడు. పాప మనసులో తెలియని భయం- దుఃఖం స్థిరపడ్డాయి. అమ్మ ధ్యాసే మనసు నిండా...

కొద్ది రోజులు ఎలాగో గడిచాయి. అమ్మ జ్ఞాపకాలు నుండి తప్పించుకోవాలని చూస్తున్నారు నాన్న, నాయనమ్మ...అందరూ. ఎవరూ అమ్మ మాటే తల పెట్టడం లేదు. పాపకు ఏడుపొస్తోంది. కోపమొస్తోంది. ఎందుకో ఈ అన్యాయాన్ని ఆ లేత మనసు సహించలేకపోతోంది. అమ్మను మరచిపోవడం సాధ్యమా...? సాధ్యమే అనిపిస్తోంది పెళ్ళికి! పాపకు ఏదో అర్థమవుతోంది. ఇంట్లో కొత్త సందడి మొదలైంది. కలత పడిన పాప హృదయం అమ్మను తలచి, తలచి మరింత కృంగిపోయింది. తన చిన్న పెట్టెలో దాచుకున్న అమ్మ చీర గుండెలకదుముకుంది ఆర్తితో- అమ్మ స్పర్శలాగే మృదువుగా...హాయిగా వుందా జ్ఞాపకం. అచ్చం అమ్మలాగే అనురాగంతో-ఆప్యాయంగా దగ్గరగా హదువుకుంటోంది. పాప గుండెల్లోంచి నవ్వుతోంది అమ్మ ప్రేమగా-దయగా. 'ఇంతే తల్లీ...ఈ లోకం...' అని బుజ్జగిస్తోంది. 'అమ్మా... అమ్మా...!' అనుకుంది ఆర్ద్రంగా పాప...అమ్మ... అమ్మ... ఎక్కడో లేదు. తనలోనే వుంది. తన గుండెలోనే వుంది. తన ఊపిరిలోనే వుంది అమ్మ.

—యర్రమిల్లి విజయలక్ష్మి



"రండి మేడమ్ రండి" రిక్షా దిగి పాఠశాలలో అడుగు పెట్టిన మనోహరీ దేవిని చుట్టుముట్టారు ఉపాధ్యాయిను లంతా.

అంతవరకు తన కింద పనిచేసిన వారంతా ఈ రోజు తన చుట్టూ చేరి అలా స్వాగతం పలుకుతూ వుంటే ఆమె మనస్సు సంతోషంతో ఊగిసలాడింది.



"ఎందుకమ్మా, ఇంత హడావిడి. రోజూ మీతో పనిచేసిన మనిషినేగా" అంది మనసును దాచుకుంటూ.

"ఇంక రేపటి నుంచి మీరు మాతో వుండరు కదా మేడమ్" వారి కంఠాలు బరువెక్కాయి. వారి మాటలు మధ్యలోనే ఆగిపోయాయి. వారి ముఖాల్లో తెలియని బాధ తొంగి చూసింది.

"మేడమ్ వచ్చేసారా! రండి! రండి! మీ కోసమే చూస్తున్నాం" అప్పుడే అక్కడకు వచ్చిన శశిరేఖమ్మ తన గదిలోకి తీసుకు వెళ్ళి కుర్చీలో కూర్చోపెట్టింది. మిగిలిన వారంతా ఆమె వెనకే వచ్చారు.

అంతకు ముందు రోజే పది సంవత్సరాలు ప్రధానోపాధ్యాయినిగా పనిచేసి మనోహరీదేవి రిటైరు అయింది. అంత వరకు అసిస్టెంటుగా పనిచేసిన శశిరేఖమ్మ ఆ స్థానంలోకి వచ్చింది.

ఇన్నాళ్ళు తను కూర్చున్న కుర్చీలో కూర్చున్న శశిరేఖమ్మను వింతగా చూసింది మనోహరిదేవి. ఆ కుర్చీలో కూర్చోగానే శశిరేఖమ్మలో ఏదో వింత హుందాతనం కనబడుతోంది. మరి తనలో ఆ హుందాతనం పోయిందా? అనుకోకుండా తనవైపు తానే చూసుకుంది. ఏదో తెలియని లోటు మనస్సులో మెదిలి మనస్సు చివుక్కుమంది.

ఆ రోజు మనోహరీదేవికి వీడ్కోలు సభ ఏర్పాటు చేసారు. ఆ పాఠశాలలోనే ఉపాధ్యాయినిగా చేరిన మనోహరీదేవి సుమారు ఇరవై సంవత్సరాలు పనిచేసి ప్రధానోపాధ్యాయిని అయింది. ఆ పాఠశాలకు- ఆమెకు ముప్పై సంవత్సరాల అనుబంధం. ఆ పాఠశాలలోని ప్రతిగది, ప్రతిగోడ, ప్రతి బల్ల, ప్రతి వస్తువు ఆమెకు సుపరిచితమే. ఆ ఆవరణలోని ప్రతి చెట్టు ప్రతి మొక్క ఆమె చేతిలో పెరిగినవే.

అక్కడక్కడ తెల్లబడిన ఆమె జుట్టు ఆమె జీవితానుభవాలకు చిహ్నంగా కనబడుతోంది. కొద్ది ముడుతలు పడిన నుదురు, జారిన చెక్కిళ్ళు ఆమె వయసుకు వింత శోభ కలిగిస్తున్నాయి. లేత రంగు సాదా నేత చీరలో కూర్చున్న ఆమె ఆ కుర్చీకే నిండుగా కనబడుతోంది. ఆమె మనసు మెత్తనిది అయినా మాటలో గాంభీర్యముంది. ఆ మాటే పది మందిని ఆకట్టుకుంటోంది. అందుకే ఆమె సర్వీసంతా ఏ ఒడుదుడుకులు లేకుండా సాగిపోయింది.

అంతటి సాన్నిహిత్యమున్న ఆ ప్రాంతాన్ని వదిలి రేపటి నుంచి ఎలా వుండగలను? అనుకున్న ఆమె. మనస్సు చివుక్కు మంది. కళ్ళు తడి అయ్యాయి.

"అంతా రెడీ చేసాము మేడమ్. మీరింక రావాలి" పదవ తరగతి చదువుతున్న విద్యార్థినుల గుంపు వచ్చి హడావిడి చేసింది.

"ఎందుకమ్మా ఈ హడావిడి. నేను వద్దని చెప్పాను కదమ్మా!" అంటున్న ఆవిడ మాటలు వినిపించుకోకుండానే-

"మీరలా అంటే ఎలా మేడమ్! మీతో సంతోషం పంచుకోవాలనే కదండీ ఇవన్నీ ఏర్పాటు చేసాము. మాకా అవకాశం వద్దంటారా మేడమ్?" వాళ్ళ కళ్ళలో నీళ్ళు తిరిగాయి. వారి ఆప్యాయతకు కరిగిపోయింది ఆమె మనసు.

"మేడమ్ వస్తున్నారు కదా! మీరింక పదవండమ్మా!" పనులన్నీ ముగించుకుని సీట్లోంచి లేచింది శశిరేఖమ్మ.

అంతలో గంట మోగింది. మిగిలిన ఉపాధ్యాయిను లంతా తరగతులు వదిలి రిజిష్టర్లు సర్దుకుని మనోహరీదేవివైపు వచ్చారు.